తాగునీటి సమస్య తలెత్తకుండా

కార్యాచరణకు ప్రణాళికలు

రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ సెక్రెటరీ విజయేంద్ర బోయ

- ◆ తాగునీటి సరఫరాపై మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం
- ◆ పాల్గొన్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక, ఉన్నతాధికారులు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విజయేంద్ర బోయ, చిత్రంలో కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని.. రంగారెడ్డి జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ, స్పెషల్ సెక్రెటరీ విజయేంద్ర బోయ అధికారులకు సూచించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారి విజయేంద్ర బోయ రంగారెడ్డి కలెక్టర్ శశాంకతో కలిసి తాగునీటి సరఫరాపై మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ముందుగా క్షేత్ర స్థాయిలో తాగునీటి సరఫరా పరిస్థితి గురించి సంబంధిత అధికారులు స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా విజయేంద్ర బోయ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సరఫరా అంశం అత్యంత కీలకమైనదని, దీనిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా తీరును అనునిత్యం క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు. పరిస్థితులను అర్థం చేసుకొని ప్రత్యేక దృష్టిసారిస్తూ.. మీమీ స్థాయిలో బాధ్యతాయుతంగా పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తితే వెంటనే యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట చేతి పంపులు, బోరు మోటార్లు, పైప్ లైన్ల మరమ్మతులు వంటివి సకాలంలో చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, నీటి ఎద్దడి కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారనే మాటకు అస్కారం లేకుండా అంకితభావంతో ప్రతిఒక్కరూ విధులు నిర్వర్తించాలని ఆమె సూచించారు.

అవసరమైన చోట నీటి రవాణా కోసం ట్యాంకర్లను వినియోగించాలన్నారు. మున్సిపల్ కార్యాలయాలకు, వాటర్ వర్క్స్ కార్యాలయాలకు, వచ్చే ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపల్ పరిధిలో టోల్ ఫ్రీ, కాల్ సెంటర్ నెంబర్లు ప్రతి ఒక్కరికీ తెలిసేలా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలోని మండలాల పరిధిలో గల నివాస ప్రాంతాలకు సరిపడా నీటి నిలువలు అందుబాటులో ఉన్నాయా? లేదా అన్న అంశంపై అందరికీ అవగాహన ఉండాలని, అవగాహన ఉంటే సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించడానికి వీలవుతుందన్నారు. మండల ప్రత్యేక అధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్ర స్థాయిలో నీటి సరఫరా తీరును అనునిత్యం పర్యవేక్షణ జరపాలని సూచించారు. స్పెషల్ ఆఫీసర్లు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తూ, ఎక్కడైనా లోపాలు గమనించినా వెంటనే వాటిని సరిదిద్దాలని, తాగునీటి వ్యవస్థకు ఇబ్బంది తలెత్తకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని మార్గనిర్దేశం చేశారు. ముఖ్యంగా మిషన్ భగీరథ ద్వారా పూర్తి స్థాయిలో నిర్ణీత పరిమాణంలో నీటి సరఫరా జరుగుతున్నదా లేదా అన్నది మండల అధికారులు, గ్రామపంచాయతీల కార్యదర్శులు చూడాలని ఆయన సూచించారు.

మండల స్పెషల్ ఆఫీసర్లుగా జిల్లా అధికారులు

కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. వేసవి కాలంలో నీటి వినియోగం పెరిగి తాగునీటి వనరులు తగ్గిపోతాయని, ఈ సమయంలో ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకై జిల్లా అధికారులను మండల స్పెషల్ ఆఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని తండాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా తాగునీటి ఎద్దడి ఏర్పడితే నీటి సమస్యను పరిష్కరించడం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నం.9347492260కు ఫోన్ ద్వారా గాని, వాట్సప్ ద్వారా గాని ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎక్కడా నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నామని, అవసరమైన చోట బోరు మోటర్లు, హ్యాండ్ పంపులు, ఇతర తాగునీటి వనరులకు మరమ్మతు పనులు జరిపిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేశ్ మోహన్, డీఆర్డీఏ పీడీ శ్రీలత, మున్సిపల్ కమిషనర్లు, వాటర్ వర్క్స్ అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు మీడియా ప్రతినిధులకు అనుమతి

షాబాద్ : పోలింగ్/కౌంటింగ్ కవరేజ్ కోసం ఎలక్షన్ కమిషన్ ద్వారా మీడియా పాసులు (అథారిటీ లెటర్స్) పొందనున్న మీడియా ప్రతినిధులకు కూడా ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతించిందని రంగారెడ్డి కలెక్టర్ శశాంక తెలిపారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలుపడనివారు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 16లోగా సంబంధిత శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సమర్పించే ఫారం-12(డీ)లను మాత్రమే పరిగణనలోకి తీసుకుని పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పించబడుతుందని స్పష్టం చేశారు. ఫారం-12(డీ) దరఖాస్తులు నోడల్ అధికారి కార్యాలయంతోపాటు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, డీపీఆర్‌వో కార్యాలయం నుంచి కూడా పొందవచ్చని, ఎన్నికల సంఘం పోర్టల్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. నిర్ణీత గడువు లోపు దరఖాస్తు చేసుకున్నవారు సంబంధిత శాసనసభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా పోస్టల్ ఓటింగ్ సెంటర్ అందుబాటులో ఉంటుందని, హెల్ప్ డెస్క్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒకసారి పోస్టల్ బ్యాలెట్ కోసం నిర్ణీత ఫారం ద్వారా దరఖాస్తు చేసుకున్నవారికి ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసే అవకాశం కల్పించబడదని, ఓటరు జాబితాలో వారి పేరును పోస్టల్ బ్యాలెట్ కింద మార్కింగ్ చేయబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అందుకోసం పోస్టల్ బ్యాలెట్ వినియోగించదల్చిన మీడియా ప్రతినిధులు డీపీఆర్‌వో కార్యాలయంలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

బస్ షెల్టర్ లేక ఎండలో నిలుచొని బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

నిలువ నీడలేక.. మండుతున్న ఎండలో..

బస్ షెల్టర్‌లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మొయినాబాద్, ఏప్రిల్ 6 : నిప్పులు కక్కుతున్న సూర్యుడు.. వాతావరణం వేడెక్కడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎక్కడ నీడ ఉంటే అక్కడికి పరుగులు తీస్తున్నారు. మొయినాబాద్‌లోని ఆర్టీసీ బస్‌స్టాపుల్లో బస్ షెల్టర్‌లు లేక ప్రయాణికులు ఎండలో నిలబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం దుకాణ సముదాయాల ఎదుట నీడకు నిలుచుందామన్నా అవకాశం లేకుండా పోయింది. ప్రయాణికుల తిప్పలు పాలకులకు పట్టదా..? ప్రజల సంక్షేమాన్ని కోరుకునే ప్రజాపాలన ప్రభుత్వం ఆర్టీసీ బస్‌స్టాప్‌లలో బస్ షెల్టర్లను ఏర్పాటు చేయదా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బస్ షెల్టర్లను ఏర్పాటు చేసి నిలువ నీడను కల్పించాలని కోరుతున్నారు.

పక్షుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక చర్యలు

మున్సిపాలిటీలో పది చోట్ల నీటి తొట్ల ఏర్పాటు

పక్షుల దాహార్తి తీర్చడం కోసం మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన నీటి పాత్ర

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 6 : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో అధికారులు ప్రజల దాహార్తితోపాటు పక్షుల దాహార్తినీ తీర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండలు మండిపోతున్న దృష్ట్యా నీరులేక పక్షులు మృత్యువాత చెందుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో పక్షులు ఎక్కువగా నివసించే ప్రధాన ప్రాంతాల్లో నీటి తొట్లను ఏర్పాటు చేసి అందులో ప్రతిరోజూ నీరును నింపుతున్నారు. ఇందుకోసం మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు సిబ్బందిని కేటాయించారు. ఈ సిబ్బంది పక్షులు అధికంగా నివసించే ప్రాంతాల్లో తొట్లను ఏర్పాటు చేసి నీటిని అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యంగా పక్షులు అధికంగా నివసించే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ, సీతారాంపేట్, ఖానాపూర్ గ్రామాల్లో కూడా మరో పదిహేను చోట్ల వీటిని ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు. ప్రజల కోసం అంబేద్కర్ చౌరస్తా, బస్టాండు పరిసర ప్రాంతాలు, తహసీల్దార్ కార్యాలయం వద్ద, పాత బస్టాండ్ వద్ద దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శేరిగూడ, ఖానాపూర్ గేట్ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడి అక్కడ కూడా ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రత్యేక సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

పంతం నెగ్గించుకున్న కోమటిరెడ్డి వర్గం..

- ❍ ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ పగ్గాలు మర్రి నిరంజన్‌రెడ్డి చేతికే..
- ❍ వైస్ చైర్మన్‌గా కామండ్ల యాదగిరి

ఆదిబట్ల, ఏప్రిల్ 6 : ఆదిబట్ల మున్సిపాలిటీలో వార్ వన్‌సైడ్‌గా సాగింది. మొన్నటి వరకు అటు మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వర్గాలుగా ఆదిబట్ల మున్సిపాలిటీ కాంగ్రెస్‌లో వర్గపోరు కొనసాగింది. దీంతో 13 మంది కౌన్సిలర్లతో తీర్మానం చేసి చైర్మన్ కొత్త ఆర్తీక, వైస్ చైర్మన్ కోరే కళమ్మలపై అవిశ్వాసం పెట్టి పదవి నుంచి దించివేశారు. దీంతో నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అడ్డుపడుతున్నారనే నెపంతో మర్రి నిరంజన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు చివాట్లు వేయడంతో కలెక్టర్, మున్సిపల్ అధికారులు ఆగమేఘాల మీద శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్‌గా మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచరుడైన మర్రి నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కామండ్ల యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ రెండు పదవులు అధికార పార్టీ కైవసం చేసుకున్నది. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, బీజేపీ కౌన్సిలర్‌తోపాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు పూర్తి మద్దతు తెలుపడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ముందుగానే చైర్మన్‌గా మర్రి నిరంజన్‌రెడ్డికి 13 మంది కౌన్సిలర్లు మద్దతు ఉన్నది. కానీ వైస్ చైర్మన్‌కు మాత్రం శనివారం ఉదయం వరకు తీవ్రంగా పోటీ ఏర్పడడంతో అటు బీఆర్‌ఎస్ సభ్యులు, కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా పోటీ పడ్డారు. చివరకు కాంగ్రెస్‌కు చెందిన కామండ్ల యాదగిరిని వైస్ చైర్మన్ పదవి వరించింది.

చైర్మన్‌గా మర్రి నిరంజన్‌రెడ్డి

వైస్ చైర్మన్‌గా కామండ్ల యాదగిరి

ఐదు మంది కౌన్సిలర్లు ఉన్నా..

ఆదిబట్ల మున్సిపాలిటీలో మొత్తం 15 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అందులో అత్యధికంగా మున్సిపాలిటీ పరిధిలోని కొంగర కలాన్ గ్రామం నుంచి 5 మంది కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కొత్త ఆర్తీకతో పాటు వనం శ్రీను, కోల నాగేశ్, దాసు, మహేందర్ గత ఎన్నికల్లో గెలుపొందారు. వీరిలో ముగ్గురు బీఆర్‌ఎస్, ఇద్దరు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. దీంతో కొంగరకలాన్‌కు చెందిన కొత్త ఆర్తీకను చైర్మన్‌గా ఎన్నిక చేశారు. ఆదిబట్లకు చెందిన కోరే కళమ్మను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టి చైర్మన్, వైస్ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించడంతో తిరిగి ఆదిబట్లకు చెందిన మర్రి నిరంజన్‌రెడ్డికి చైర్మన్ పదవి దక్కింది. కొంగరకలాన్ గ్రామానికి చెందిన చైర్మన్ పదవి పోవడంతో కనీసం వైస్ చైర్మన్ పదవి వస్తుందని గ్రామస్తులు అనుకున్నారు. 5 మంది కౌన్సిలర్లు ఉన్నా ఒక్క పదవి కూడా దక్కలేదు.

పట్టువదలని విక్రమార్కుడిలా..

రాజకీయంలో ఓర్పు పట్టుదల ఉండాలంటారు.. కానీ మర్రి నిరంజన్‌రెడ్డికి ఇవి మెండుగా ఉన్నాయనే చెప్పుకోవాలి. తనకు ఏ పదవి మొదటగా రాలేదు. గతంలో తాను ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పాడు గ్రామంలో ఎంపీటీసీగా పోటీ చేసి గెలిచారు. అప్పట్లో ఎంపీపీగా ప్రయత్నం చేసినా మరో వ్యక్తి వెంకట్‌రెడ్డి ఎంపీపీగా గెలుపొందారు. తరువాత ఇతడిపై మర్రి నిరంజన్‌రెడ్డి అవిశ్వాసం పెట్టించి అవిశ్వాసంలో నెగ్గి రెండోసారి ఎంపీపీగా గెలుపొందారు. తరువాత ఇప్పుడు ఆదిబట్ల 9వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొంది తాను ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ ఎన్నిక కోసం ఎన్నో రకాలుగా ప్రయత్నించినా.. అప్పట్లో తాను చైర్మన్ కాకుండా కొత్త ఆర్తీక చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఇప్పుడు ప్రస్తుత చైర్‌పర్సన్ కొత్త ఆర్తీకపై అవిశ్వాసం పెట్టించి తాను ఇప్పుడు రెండోసారి చైర్మన్‌గా పదవి చేపట్టారు. దీంతో మర్రి నిరంజన్‌రెడ్డి పట్టువదలని విక్రమార్కుడేనని చెప్పుకోవాలి.

మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తా..

చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి

ఆదిబట్ల మున్సిపల్ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. తాను చైర్మన్‌గా ఎన్నిక కావడంతో ముందుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. దీంతో మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వంపై కొట్లాడి మరిన్ని నిధులు తీసుకువస్తానన్నారు. మంత్రి కోమటిరెడ్డి సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందుకు తీసుకుపోతానన్నారు.

- □ వికారాబాద్, రంగారెడ్డి కలెక్టర్లు నారాయణరెడ్డి, శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ
- □ ఏఆర్‌వోలు, నోడల్ అధికారులతో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణపై సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో రంగారెడ్డి కలెక్టర్, వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తదితరులు

రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా

విధులు నిర్వహించాలి

వికారాబాద్, ఏప్రిల్ 6 : అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించిన విధంగానే రీ పోలింగ్ కు ఆస్కారం లేకుండా పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించాలని, ఫామ్ -7, 8లను పెండింగ్‌లో పెట్టకుండా డిస్పోస్ చేయాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక, వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహతో కలిసి చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణపై ఏఆర్‌వోలు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా నిర్వహించాలని ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులను ఆదేశించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కింద చేవెళ్ల, రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్లు వస్తాయని తెలిపారు. 7 నియోజకవర్గాల్లో 29,19,465 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 2,824 పోలింగ్ కేంద్రాలు, 53 సహాయక పోలింగ్ కేంద్రాలు మొత్తం 2,877 పోలింగ్ కేంద్రాలున్నాయని చెప్పారు. పోలింగ్ సిబ్బందికి మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి పీవోలు, ఏపీవోలకు ఈ నెల ఒకటి, రెండు తేదీల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం, వీవీ ప్యాట్లకు మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఫామ్-7, 8లను పెండింగ్‌లో పెట్టకుండా డిస్పోస్ చేయాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఫామ్-2 అందజేసి వారు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఉన్న దగ్గరే రిసెప్షన్ సెంటర్ కూడా ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ టెక్నాలజీలో ఉంటుందన్నారు. కౌంటింగ్ సెంటర్ వద్ద స్ట్రాంగ్ రూమ్స్ కూడా ఉంటాయని, స్ట్రాంగ్ రూమ్స్ వద్ద బారికేడ్లు, సివిల్ పనులు, కావలసిన వసతులు ఏర్పాటు చేసుకోవాలని ఏఆర్‌వోలకు సూచించారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి టీములను పర్యవేక్షించాలన్నారు. నగదు, మద్యం పంపిణీ జరుగకుండా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బందికి రెండో విడుత శిక్షణలో పోలింగ్ నిబంధనలు, మాక్ పోల్ నిర్వహించే విధానం, పోలింగ్ రోజు నిర్వర్తించవలసిన విధులపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించాలని ఏఆర్‌ఓలను ఆదేశించారు. పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, పోలీస్ సిబ్బంది అందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. 85 సంవత్సరాల వయసు పైబడిన వృద్ధులు, 40 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులకు, అత్యవసర విధులు నిర్వహించే సిబ్బందికి ఫామ్-12డి అందజేసి ఓటు హక్కు వినియోగించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఏఆర్‌వోలు జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్తు సరఫరా, ట్యూబ్‌లైట్లు ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు.

15వ తేదీ నుంచి సెల్ట్‌లో ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సు

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీలోని సెల్ట్‌లో ఈ నెల 15వ తేదీ నుంచి పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వేర్వేరుగా ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సు తరగతులను ప్రారంభించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్‌సౌడ తెలిపారు. 8, 9, 10 తరగతులు, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు వేర్వేరుగా ఒక నెలరోజుల సర్టిఫికెట్ కోర్సును సెల్ట్‌లో నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ నం: 7989903001లో సంప్రదించాలని ఆయన సూచించారు.

గాంధీలో డయాలసిస్ హబ్

కమాండ్ కంట్రోల్ కేంద్రమూ ప్రారంభం

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 6 : కిడ్నీ సమస్యలతో ఉన్న బాధితులకు డయాలసిస్ చేస్తున్న ఉత్తర తెలంగాణాలోని 22 కేంద్రాలతో అనుసంధానం చేస్తూ, గాంధీ దవాఖానలోని నెఫ్రాలజీ విభాగంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక హబ్, స్పోక్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని శనివారం గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు ప్రారంభించారు.

అనంతరం, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీహరి, నెఫ్రాలజీ విభాగం హెచ్‌ఓడీ, ప్రొఫెసర్ ఎడ్ల మంజూషతో కలిసి వివిధ జిల్లాలలోని డయాలసిస్ కేంద్రాల ఇన్‌చార్జీలు, రోగులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కిడ్నీ సమస్యలతో ఉన్న రోగుల ఆరోగ్య స్థితిగతులను నిరంతరం సమీక్షిస్తూ ఉండాలని, సకాలంలో వారికి వైద్యం అందించాలని, పరిస్థితి క్షీణిస్తే వారిని గాంధీ దవాఖానకు సిఫారసు చేయాలని ఆయన అన్నారు. రోగులను డయాలసిస్ చేశాక ఆరోగ్యం ఎలా ఉంది? మందులను వాడుతున్నారా? ఇతర సమస్యలు ఏవైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన ఈ కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా 24 గంటల పాటు పర్యవేక్షణ ఉంటుందని, ప్రతిరోజూ డయాలసిస్ కేంద్రాల ఇన్‌చార్జీలు, ఆయా దవాఖానాల సూపరింటెండెంట్లు మాట్లాడవచ్చని డాక్టర్ రాజారావు అన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న డయాలసిస్ కేంద్రాల నుంచి గాంధీ దవాఖానలో ఉన్న హబ్‌కు లింక్ చేశామని, వారు అక్కడి నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిపుణులైన వైద్యులతో సలహాలను, సూచనలను పొందవచ్చని తెలిపారు. అవసరమైనవారికి జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా గాంధీ దవాఖానలో కిడ్నీ మార్పిడి కూడా చేస్తున్నామని ఆయన అన్నారు.

గాంధీ దవాఖానలో డయాలసిస్ హబ్, కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ప్రారంభించిన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు

గాంధీ దవాఖాన హబ్ నుంచి అనుసంధానమైన డయాలసిస్ కేంద్రాలివే..

కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జనగామ, ఇల్లందు, ఖమ్మం, కోరుట్ల, వేములవాడ, గోదావరిఖని, హుజూరాబాద్, ధర్మపురి, జగిత్యాల, మణుగూరు, మహదేవ్‌పూర్, జాఫర్‌గఢ్, భద్రాచలం, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వరావుపేట్, నర్సంపేట్, మహబూబాబాద్ డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి.

మైలార్‌దేవ్‌పల్లిలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

అవకాశవాద రంజిత్‌రెడ్డిని చిత్తుగా ఓడిద్దాం

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ/మైలార్‌దేవ్‌పల్లి ఏప్రిల్ 6: బీఆర్‌ఎస్‌ను మోసం చేసిన రంజిత్‌రెడ్డిని వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కేవీఎంఆర్ ఫైడ్ గార్డెన్స్‌లో శనివారం బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం శక్తి వంచన లేకుండా పోరాటం చేసి స్వరాష్ట్రాన్ని సాధించి పెట్టిన కేసీఆర్‌కు వెన్నంటే ఉంటూ.. చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగురవేసి ఆయనకు బహుమానంగా అందించేందుకు నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ బూనాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల ప్రజల మద్దతుతో ఎంపీగా గెలుపొంది ఐదేండ్ల పాటు రాజయోగం అనుభవించిన గడ్డం రంజిత్‌రెడ్డి పెద్ద అవకాశవాది అని విమర్శించారు. అలాంటి అవకాశవాదులను చేవెళ్ల ప్రజలు ఏకమై చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. గ్రామగ్రామాన బీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకు వివరిస్తూ.. వందరోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలైన విషయాలను ప్రజలకు బీఆర్‌ఎస్ శ్రేణులు తెలియజేసి.. ఓట్లను అభ్యర్థించాలని కోరారు. బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతిగా 96 బీసీ కులాలను ఏకతాటిపైకి తీసుకొచ్చిన బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల పార్లమెంటు సభ్యుడిగా అఖండమైన మెజార్టీతో గెలిపించుకునేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు పనిచేయాలన్నారు. ఈ నెల 13న చేవెళ్ల గడ్డపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించే భారీ బహిరంగ సభకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున జనసమీకరణ చేపట్టాలని ఎమ్మెల్యే శ్రేణులను కోరారు. అలాగే మైలార్‌దేవ్‌పల్లిలో రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ రోజు రోజుకూ మరింత బలం పుంజుకుంటుందన్నారు. బీఆర్‌ఎస్‌కు నాయకులు, కార్యకర్తలే బలగం అన్నారు. ఆయా కార్యక్రమాల్లో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖా యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేశ్ యాదవ్, మాజీ ఎంపీపీ మల్లేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు అంతారం నరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.